క్లుప్తంగా

రూరల్ సీఐగా మోహన్‌రెడ్డి


కె.మోహన్‌రెడ్డి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: కడప జిల్లా ముద్దనూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కె.మోహన్ రెడ్డి స్థానిక రూరల్ సీఐగా బదిలీపై రానున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ బీఏ.మంజునాథ్ కర్నూల్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. రెండు రోజుల్లో కె.మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

2న క్రీడాపోటీలు

నందవరం: మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో మారెమ్మ, దేవమ్మ, సుంకులమ్మ దేవర సందర్భంగా జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ రాముడు, నరసన్న తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ గ్రామంలో 2వ తేదీన బాల, బాలికలకు పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్ 95536 92664, 96405 57795 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

ఆస్పరి: మండలంలోని కైరుప్పల, ముత్తుకూరు గ్రామాలలో బోర్ల కింద సాగు చేసిన వేరుశనగ ఈక్రాప్ బుకింగ్‌ను మంగళవారం ఆలూరు ఏడీఏ సునీత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 528 ఎకరాల్లో రబీ సీజన్‌లో బోర్ల కింద వేరుశనగ పంటను సాగు చేశారన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈక్రాప్ నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఏఓ మునెమ్మ, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

తుగ్గలి: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఫిబ్రవరి 8 వరకు పొడిగించినట్లు ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. వివరాలకు ఆయా పాఠశాలల హెచ్ఎంలను సంప్రదించాలన్నారు.

పింఛన్ కానుక పంపిణీకి సిద్ధం

తుగ్గలి: మండలంలో బుధవారం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ ఎస్ఎం బాషా తెలిపారు. మండలవ్యాప్తంగా 7,654 మందికి పంపిణీ చేసేందుకు రూ.2,11,61,250 మంజూరైందన్నారు. వలంటీర్లు ఉదయం నుంచే లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తారని చెప్పారు.

తాగునీటి సమస్య తీర్చండి

తుగ్గలి: తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ పి.కొత్తూరు ఎస్సీ కాలనీ వాసులు మంగళవారం ఎంపీడీఓ ఎస్ఎం బాషాకు వినతి పత్రం ఇచ్చారు. కాలనీకి నీరు సరఫరా అయ్యే పైపులైన్‌ను బంద్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ఎస్సీ కాలనీకి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోగనూరు రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. రూ.1.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

వెల్దుర్తి: రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా అనీమియా (రక్తహీనత) ముక్త్ భారత్ కింద మంగళవారం వైద్య సిబ్బంది స్థానిక పద్మ విద్య వికాస్ కాన్వెంట్ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్ఓ హసీన ఆధ్వర్యంలో చిన్నారులకు బ్లడ్ గ్రూప్ చెక్ చేస్తూ, రక్తంలోని హిమోగ్లోబిన్ శాతం పరిశీలించారు. సచివాలయ ఏఎన్ఎం గోవిందమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


బిల్లులు మంజూరు చేయండి

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాన్ని నిర్మించిన బిల్లులను సంబంధిత అధికారులు మంజూరు చేయాలని సర్పంచ్ ఆంజనేయులు కోరారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన పంచాయతీలో నిధులు లేకున్నా అధికారుల ఆదేశాల మేరకు రూ.6 లక్షలు వెచ్చించి సకాలంలో ఎస్‌డబ్ల్యూఎంసీని పూర్తిచేశామన్నారు. బిల్లులు మంజూరు చేస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేయడానికి వీలవుతుందన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉంటా

హొళగుంద: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆలూరు లేదా పత్తికొండ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటానని ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆమె హొళగుందలో సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తమ అభిమానులు ఉన్నారని, ఏదో ఒక పార్టీ తరపున ఈ విడత ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు.

శరవేగంగా నాడు - నేడు పనులు


చిప్పగిరి జెడ్పీ హైస్కూల్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

చిప్పగిరి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అదనపు గదుల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పాఠశాల అభివృద్ధికి నాడు–నేడు కింద రూ.66,97,000 మంజూరైనట్లు హెచ్ఎం రంగనాథ్ తెలిపారు. ఈ నిధులతో అదనపు గదుల నిర్మాణం చేపట్టామని, పనులు పూర్తయితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వ చేయూత


దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మండలంలో దివ్యాంగులైన తిమ్మాపురం ఎంపీటీసీ జయలక్ష్మి, సీఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ గువ్వలదొడ్డి లింగన్న, రామకృష్ణకు మొదటి విడతలో మంజూరైన మూడు చక్రాల స్కూటీలను మంగళవారం తన నివాసం ఆవరణలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం పింఛను సొమ్మును పెంచిందని, ప్రతినెలా 1వ తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగుల కోసం మూడు చక్రాల స్కూటీలను అందజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. విడతల వారీగా దివ్యాంగులకు స్కూటీలను అందజేయనున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలతో రిపబ్లిక్ డే రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న గువ్వలదొడ్డి లింగన్నను ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగుల అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, నాయకులు ముగతి విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్తంగా పట్టణంలోని వీవర్స్ కాలనీ వద్ద గల సిడాప్, డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 4వ తేదీన నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. మంగళవారం తన నివాసంలో సంబంధిత శాఖ అధికారులతో కలిసి జాబ్‌మేళా కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్ మేళాలో గ్రీన్‌టెక్, హెటీరోల్యాబ్స్, సుకృతి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్, హిల్‌మైఫ్యామిలీ, ఖజానా జ్యువెలరీస్ లాంటి ప్రముఖ కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి సోమేశ్వరరెడ్డి, సీడాప్, డీఆర్‌డీఏ జిల్లా మేనేజర్ కిరణ్, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


జాబ్‌మేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, డీఆర్‌డీఏ అధికారులు

భళా బసవన్నలు


హొళగుందలో రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన దిడ్డి డొణ్ణే పంపా అనే రైతుకు చెందిన వృషభాలు 16 క్వింటాళ్ల బరువున్న రాతిదూలాన్ని లాగి రికార్డు సృష్టించాయి. మంగళవారం హొళగుందలో సిద్ధేశ్వర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం వృషభాల రాతి దూలం లాగే పోటీలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శివన్న గౌడ్ పోటీలను ప్రారంభించారు. పంపాకు చెందిన వృషభాలు స్థానిక తేరువీధిలో 16 క్వింటాళ్ల రాతి దూలాన్ని తేరు నుంచి ఎదురు బసవన్న గుడి వరకు దాదాపు 450 మీటర్ల వరకు లాగి భళా అనిపించుకున్నాయి. వృషభాలను సాయంత్రం గ్రామంలో ఊరేగించారు.

కనులపండువగా రథోత్సవం


హోసూరులో భక్తజనవాహిని మధ్య కొనసాగుతున్న రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని శ్రీభద్రకాళీ వీరభద్రస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారి ఆలయంలో వేదమంత్రోచ్ఛరణలు మంగళవాయిద్యాల నడుమ భద్రకాళీ అమ్మవారు, వీరభద్ర స్వామి వార్ల కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం అశేష జన సందోహం మధ్య రథాన్ని భక్తులు లాగారు. రథంపైకి అరటిపండ్లు విసిరి ప్రజలు తమ భక్తిని చాటుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చేపట్టారు.


రథోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

రథోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యే హాజరు

పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ వేర్వేరుగా రథోత్సవంలో పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న వీరికి పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



పౌరహక్కుల సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి

కృష్ణగిరి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎరుకలచెర్వు గ్రామ కమ్యూనిటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం జరిగిన పౌర హక్కుల సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కుల వివక్షను నిర్మూలించాలన్నారు. అందరూ సోదరభావంతో ముందుకు సాగితే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, పీటీ సాయిప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో అంటరానితనం పోవాలంటే ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విజ్ఞప్తి చేశారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. గ్రామంలోని దళిత కాలనీలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు కృషిచేస్తామని వారు హామీ ఇచ్చారు. సోషల్ రిసోర్స్ పర్సన్ కొమ్ముపాలెం శ్రీనివాస్, ఆర్ఐ మస్తాన్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరోజమ్మ, వీఆర్వో నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ శాశ్వతంగా అమలు చేయాలి

గోనెగండ్ల: ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం గోనెగండ్లలో కేవీపీఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ ఐక్య పోరాటం ద్వారా సాధించుకున్న ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం జనవరి–23కు కాలపరిమితి ముగిసిందన్నారు. ప్రజా సంఘాల పోరాటాలను గౌరవించి చట్టాన్ని మరో పదేళ్ల రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందన్నారు. చట్టానికి సంపూర్ణ ఆయుష్షు పోసేవిధంగా శాశ్వతంగా అమలు చేయాలన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దళితుల జనాభా ప్రతిపదికన కేటాయించి, దళితుల ప్రయోజనాలకే వాటిని ఖర్చు చేయాలన్నారు. కేవీపీఎస్ నాయకులు మారేష్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


నదికైరవాడిలో సాగు చేసిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నందవరం: భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని, తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ పర్యవేక్షణ అధికారి విశ్వేశ్వరప్ప సూచించారు. మంగళవారం నదికైరవాడి గ్రామంలో సర్పంచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు క్లస్టర్ స్థాయి 'డాక్టర్ వైఎస్సార్ పొలంబడి' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని, విచక్షణా రహితంగా ఎరువులు, మందులు వాడొద్దన్నారు. తద్వారా భూసారం కోల్పోయి దిగుబడులు తగ్గిపోతాయని వివరించారు. రసాయన మందులు తగ్గించి, సేంద్రియం వైపు మళ్లాలన్నారు. అలాగే చిరుధ్యానాల సాగుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ప్రతి 2 సెం.మీ లకు 20 సెం.మీ కాలిబాటలను ఏర్పాటు చేసుకోవాలని, చదరపు మీటర్‌కు 66 మొక్కలు ఉండేలా చూసుకోవాలన్నారు. తద్వారా మొక్కకు పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని వివరించారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి పంట నమోదు త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ఏడీఏ బాలవర్ధి, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ మర్రి స్రవంతి, ఏఈఓ సురేంద్రగౌడ్, వీపీఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజా సంక్షేమానికి కృషి

- జొన్నగిరిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


జొన్నగిరిలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: తాను ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే నేతను కాదని, అనుక్షణం ప్రజలతోనే ఉంటానని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. మంగళవారం జొన్నగిరి 1, 2, 3, 4, 5వ వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందించారు. ప్రజల సమస్యలను ఓపికతో తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే శ్రీదేవి దృష్టికి తీసుకొచ్చారు. ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కొందరు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని మరి కొందరు, ప్రమాద బీమా రాలేదని గ్యాస్ సిలిండర్ పేలుడు బాధితులు, సదరం సర్టిఫికెట్ లేక పింఛన్ రాలేదని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చిన సీఎం వైఎస్ జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఆమె కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేష్, నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీరంగడు, గోపాల్‌రెడ్డి,నాగప్ప, ప్రతాపరెడ్డి, దేవి, హనుమంతు, రఘు, సోమశేఖరరెడ్డి, లోకనాథరెడ్డి, పక్కీరప్ప, తేరప్ప,సుంకప్ప,దివాకర్,అధికారులు, పాల్గొన్నారు.

పరిహారం చెక్కు పంపిణీ

చెన్నంపల్లి కోట సమీపంలో ఇటీవల చిరుత దాడిలో గ్రామస్తుడు ఉలిగిత్తి చిరంజీవికి చెందిన గొర్రె మృతి చెందింది. దీంతో అతనికి ప్రభుత్వం నుంచి రూ.10 వేలు పరిహారం మంజూరైంది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బాధిత రైతుకు పరిహారం చెక్కును అందచేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మన్న పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.52 వేలు రికవరీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ సలీం బాషా

ఆలూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా ఏపీడీ సలీం బాషా అన్నారు. మంగళవారం ఆలూరులోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం 2021–22 సంవత్సరానికి సంబంధించి రూ.10 కోట్ల నిధులతో వెయ్యి పని దినాలు కల్పించామన్నారు. చేసిన పనులను గుర్తించి ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు. పని ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, డగౌట్, ఫారంపాండ్‌లకు వర్క్‌ఫైల్ నమోదు చేయకపోవడం తదితర పనుల్లో జరిగిన అవినీతి కారణంగా రూ.52 వేలు రికవరీ చేసినట్లు వెల్లడించారు. అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఈసీలు, టీసీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆలూరు ఏపీడీ మల్లేశ్వరి, ఎంపీడీఓ అల్లబకాష్, డివిజన్ విజిలెన్స్ ఆఫీసర్ సిద్ధలింగమూర్తి, ఎస్సార్పీ వెంకటేష్ నాయక్, ఏపీఓ హేమసుందర్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

మద్దికెర: పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ సహకరించినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని సర్పంచ్ బండారు సుహాసిని, ఈఓ శ్రీహరి, పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ గతంలో తీర్మానాలు చేసిన పనులు చేపట్టడం లేదని, దీంతో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. అలాగే నేసే వీధిలో రోడ్లు వేయాలని, నిరుపయోగంగా ఉన్న ట్యాంకును వాడుకలోకి తీసుకురావాలన్నారు. సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం


కుష్టు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు/ఎమ్మిగనూరు టౌన్: 2030 నాటికి కుష్టువ్యాధి రహిత దేశంగా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, అందరి సహకారంతో కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన ప్రాజెక్టు అధికారి చంద్రయ్యశెట్టి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అర్బన్ హెల్త్ కేంద్రాల అధికారులు, సచివాయ ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ముందుగా కుష్టువ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చంద్రయ్యశెట్టి మాట్లాడుతూ కుష్టు రోగులపట్ల ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు, చికిత్స గురించి వివరించారు. ఇంటింటి సర్వే ద్వారా కుష్టు రోగులను గుర్తించి, లక్షణాలను బట్టి చికిత్స అందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ... చెవులు, ముఖంపై కణితులున్నా, కాళ్లు, చేతులపై స్పర్శ తగ్గడం తదితర లక్షణాలుంటే సమీప ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అర్బన్ కేంద్రాల డాక్టర్లు శ్రీనివాసులు, సురేష్, వీణ, శారద, ఎంపీహెచ్ఈఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రంథాలయాభివృద్ధి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

ఆలూరు: గ్రామ, మండల కేంద్రాల్లోని గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రజలు, పాఠకులు భాగస్వామ్యం కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముద్దూరు సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. హాలహర్వి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం హెచ్ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు – ప్రజలు భాగస్వామ్యం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సెక్రటరీ ప్రకాష్, చింతకుంట సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, రాంభీమ్‌నాయుడు, తిప్పారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, వెంకన్న, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ అంథోని, ఎంఈఓ ఈరన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో వివిధ పుస్తకాలతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. గ్రంథాలయాల సెస్సు, పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. పలువురు నాయకులు, అధికారులు గ్రంథాలయ సభ్యత్వాన్ని తీసుకున్నారు. స్థానిక లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి అందరినీ సన్మానించారు. హాలహర్విలో గ్రంథాలయ భవనానికి స్థలం సేకరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని చైర్మన్ హామీఇచ్చారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

పత్తికొండ రూరల్: పత్తికొండలో రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో సీఐటీయూ మండల కార్యదర్శి గోపాల్, మండల అధ్యక్షుడు కాశీనాథ్, పార్టీ నాయకులు యనుమల రమేష్, కాశన్న, గంగన్న, తాజ్‌మహమ్మద్ కూర్చొన్నారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రోడ్డు విస్తరణ చేపడతామని చెప్పి నేటి వరకు వెడల్పు చేయలేదన్నారు. ఇరుకు రోడ్లతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రోడ్డు వెడల్పు చేసి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

గణాంక సర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా గణాంక శాఖ అధికారి రంగనాయకులు

నందవరం: గ్రామాల్లో చేపట్టే చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతుల భూ వివరాల సర్వే వేగవంతం చేయాలని జిల్లా గణాంక శాఖ అధికారులు వీఆర్వోలకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణాంక శాఖ అధికారి రంగనాయకులు మాట్లాడుతూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కులాల వారీగా, లింగాల వారీగా(స్త్రీ, పురుషుడు) వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. మొదటి విడతలో భాగంగా సర్వే 40.05 శాతం పూర్తయిందని తెలిపారు. రైతుల వివరాలు పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ రఘువీర, జిల్లా ఉప గణాంకాధికారి గంగన్న, ఇన్‌చార్జ్ గణాంకాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఆరుగురికి గాయాలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు రోడ్డులో మంగళవారం రాత్రి బైకులు ఎదురెదురుగా ఢీకొని ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. కోడుమూరుకు చెందిన వీరేష్‌ఆచారి, ఈశ్వర్‌ఆచారి పత్తికొండ నుంచి హోసూరుకు బైక్‌లో వెళ్తున్నారు. ఆ సమయంలో హోసూరు నుంచి పత్తికొండకు బైక్‌పై వస్తున్న కారుమంచి బోయ సునీల్, గొల్లచందు ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదాన్ని గమనించకుండా వచ్చిన హోసూరు నాయుడు బైక్‌లను ఢీకొట్టడంతో వారందరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా కారుమంచి బోయ సునీల్, వీరేషఆచారిలను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. కర్నూలుకు తరలించిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఫోన్ ద్వారా సూపరింటెండెంట్‌ను కోరారు.

వీధి బాలలను చేరదీద్దాం


మాట్లాడుతున్న న్యాయమూర్తి తరణి

ఆలూరు రూరల్: వీధి బాలబాలికలను చేరదీసి హక్కులను కల్పించాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి తరణి అన్నారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టగానే తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలు, అనాథలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లల జీవితాలు చిన్న వయసులోనే మసిబారి పోతున్నాయన్నారు. మధురమైన బాల్యాన్ని నోచుకోని వీధి బాలలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారిని అక్కున చేర్చుకుని పాఠశాలల్లో చేర్పించి ఉన్నత విద్యావంతులను చేయాలన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, సామాన్య ప్రజలు ముందుకు రావాలన్నారు. బార్ అండ్ అసోసియేషన్ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు హాజరయ్యారు.